క్లుప్తంగా

వనం శరత్ బాబుకు బెస్ట్ ఇమేజ్ అవార్డు



ఖిలా వరంగల్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఈమేరకు వరంగల్ శంభునిపేటకు చెందిన ఫొటోగ్రాఫర్ వనం శరత్‌బాబు తీసిన చిత్రానికి బెస్ట్ ఇమేజ్ అవార్డు లభించింది. ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ నుంచి అవార్డును శరత్‌బాబు సోమవారం అందుకున్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా వెంకటేష్



వరంగల్: భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శిగా దేశాయిపేట 12వ డివిజన్‌కు చెందిన గోకె వెంకటేష్‌ను నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

యువమోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా పవన్‌కుమార్



కాశిబుగ్గ: వరంగల్ బీజేపీ యువమోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా నగరంలోని గిర్మాజీపేటకు చెందిన పోలెపాక పవన్‌కుమార్ నియమించినట్లు పార్టీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు ఎర్రగొల్ల భారత్‌వీర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

కాజీపేట రూరల్: హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామానికి చెందిన గీత కార్మికుడు జనగాని సదానందం గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కే క్రమంలో సదానందం జారిపడి మృతి చెందాడని తెలిపారు.

బాధితులకు పరామర్శ



హసన్‌పర్తి: బైరాన్‌పల్లి మాజీ ఎంపీటీసీ ముల్కలపల్లి కుమారస్వామి మృతి చెందారు. వారం రోజుల క్రితం నాగారం సమీపంలో బైక్ అదుపు తప్పిన ఘటనలో కుమారస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. కుమారస్వామి మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ సందర్శించి నివాళులర్పించి, బాధితులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

కాశీబుగ్గ సెంటర్: వరంగల్ మండలం ఉర్సులోని సర్వే నంబర్ 415లోని మూడు ఎకరాల 35 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని బొల్లం మధు తెలిపారు. కబ్జాదారులపై చర్య తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారదకు సోమవారం ఫిర్యాదు చేశాడు. మాజీ ఎమ్మెల్యే అండదండలతో ఓ మాజీ కార్పొరేటర్ 410 సర్వే నంబర్‌లోని భూమిని రిజిస్ట్రేషన్ చేసుకొని 415లో నిర్మాణాలను చేపట్టారని పేర్కొన్నారు.

హైడ్రా తరహా ఏజెన్సీని ఏర్పాటు చేయాలి



సీఎంకు రాసిన లేఖను చూపుతున్న శేషు

హన్మకొండ: వరంగల్ నగరంలోని ఆక్రమణలను తొలగించడానికి ప్రజలకు మెరుగైన సేవలు అందించటానికి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన హైడ్రా లాంటి ఒక స్వతంత్ర ఏజెన్సీని ఏర్పాటు చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. హనుమకొండలో లేఖను సోమవారం విడుదల చేసి మాట్లాడారు. వర్షాలకు నగరంలోని లోతట్టు ప్రాంతాలు, కాలనీలు వరద నీటిలో మునిగిపోతున్నాయని, ఆక్రమణల వల్లనే ఈ దుస్థితి నెలకొందని శేషు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నగరంలో ఆక్రమణలను తొలగించడానికి, ఉల్లంఘనలపై చర్యలు చేపట్టడానికి, ఆస్తుల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించటానికి తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో హైడ్రాకు రూ.200 కోట్లు కేటాయించిన విధంగానే వరంగల్ నగరాభివృద్ధికి కూడా ముఖ్యమంత్రి ప్రత్యేక సహాయ నిధి కింద రూ.500 కోట్ల రూపాయలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా రాఖీ వేడుకలు

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి రాఖీ కడుతున్న విద్యార్థినులు



పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి..



దాస్యం వినయ్‌భాస్కర్‌కు..



అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ వేడుకలను నగర వ్యాప్తంగా ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమ సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. అక్కాచెల్లెళ్లకు అన్నాతమ్ముళ్లు కానుకలు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎమ్మెల్యే నాయినికి రాఖీ కడుతున్న రెడ్డి క్యాథలిక్ సంఘం ఆడపడుచులు



బీజేపీ నాయకులకు రాఖీ కడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద



సీఎంకు రాఖీ కడుతున్న మేయర్ సుధారాణి



ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి..



కాశీ విశ్వేశ్వరుడికి భక్తులు కట్టిన రాఖీలు



గణేష్‌నగర్‌లో సోదరులకు రాఖీ కడుతున్న యువతి



హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని నివాసంలో బీఆర్ఎస్ నేత రాకేష్‌రెడ్డికి రాఖీలు కట్టిన మహిళలు



మడికొండ: తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క

దేవాలయాల్లో శ్రావణమాస పూజలు



మెట్టుగుట్టపై అభిషేకాలు చేస్తున్న భక్తులు



కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయంలో..



కాశిబుగ్గ రంగనాథస్వామి దేవాలయంలో..

మడికొండ: శ్రావణమాసం సందర్భంగా కాజీపేట మండలం మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి అభిషేకం, అర్చనలు చేశారు. అలాగే, సీతారామచంద్ర స్వామి ఆలయంలో అభిషేకం అర్చనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషు భారతి, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పారుపల్లి సత్యనారాయణ శర్మ, పరాశరం విష్ణువర్ధన చార్యులు, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, వస్కుల ఉమ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో..

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున కాశీ విశ్వేశ్వరుడికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు 9 కిలోల నెయ్యితో ఆలయంలోని సహస్ర లింగానికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం 75 కిలోల అన్నంతో అన్నపూజ నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

సామూహిక సత్యనారాయణ వ్రతం

శ్రావణమాసం పౌర్ణమిని పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గలోని రంగనాథస్వామి దేవాలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతానికి భక్తులు హాజరై పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి చిలుపూరి సురేష్, కోశాధికారి సుల్తానా సమ్మక్క, మంచాల సృజన, శ్రీనివాస్, రోజా, అర్చకులు విక్కీ, భాస్కర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు

ఖిలా వరంగల్: విద్యానగర్ కాశికుంటలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న కట్టమైసమ్మ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ప్రారంభమైనట్లు ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కావేటి శంకర్, ఉపాధ్యక్షురాలు, కోశాధికారి ట్రాన్స్‌జెండర్ సవరం రంజిత, ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్‌కుమార్ తెలిపారు. ఈమేరకు కాశికుంట వాంబే కాలనీలో నిర్మించిన కట్టమైసమ్మ ఆలయంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మంగళవారం యాగశాల ప్రవేశం, పుణ్యాహ వచనం, నాంది మాతృకాపూజ, దీక్షా కంకణం, పంచగవ్య శ్రవణం, చండీహోమం, 21న తెల్లవారు జామున విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి, కుంకుమ పూజ, తీర్థప్రసాద వితరణ, మధ్యాహ్నం మహాన్నదానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యాకయ్య, ఆడెపు లక్ష్మణ్, సాంబయ్య, నీలం అశోక్, సురేందర్, బాబురావు, రవీందర్, సునీల్, రాజేష్, శైలజ, ప్రశాంత్, శ్రీనివాస్, అయిలయ్య, శోభ, యశోద, శారద, అనూష తదితరులు పాల్గొన్నారు.

‘విధ్వంసం, మోసాలకు పాల్పడలేదు’



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ ఇర్ఫాత్

ఖిలా వరంగల్: ఈద్గా, మసీదు అభివృద్ధే లక్ష్యంగా 25 ఏళ్లుగా పనిచేస్తున్నామని, ఎలాంటి విధ్వంసం, మోసాలకు పాల్పడలేదని ఖిలా వరంగల్ ఈద్గా మసీదు అధ్యక్షుడు సయ్యద్ ఇర్ఫాత్, కోశాధికారి సయ్యద్ ఇబ్రహీం ఖలీల్, ప్రధాన సలహాదారు ఎం ఏ.జబ్బార్ తెలిపారు. ఈద్గా మసీదు బాధ్యులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, తమపై తప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఈద్గా మసీదులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పలు ప్రాంత ముస్లిం పెద్దలు, ముస్లింలతో ఈద్గా, మసీదు కమిటీ ఎన్నిక కాగా, వక్ఫ్ బోర్డు నియామక పత్రాన్ని విడుదల చేసిందని గుర్తు చేశారు. ఈద్గా స్థల పరిరక్షణ కోసం ప్రహరీ నిర్మించామని, ప్రార్థనలు, నమాజ్ కోసం ఏసీలు, సీసీ కెమెరాలు బిగించినట్లు వివరించారు. ఖబ్రస్తాన్‌లో మృతదేహాలను సమాధి చేసేందుకు వెళ్లిన వారి నుంచి అక్రమ వసూళ్లు పాల్పడుతున్న వ్యక్తిని ఇదేమిటని నిలదీస్తే తమపైనే అక్రమ కేసులు పెట్టినట్లు వారు ఆరోపించారు. కమిటీ ప్రతినిధులు ముఖ్దాం, హసన్ అలీబేగ్, మహబూబ్ జానీ, ఎండీ.అమ్జద్, ఎండీ.షౌకత్, గఫార్, అశ్రఫ్ పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలు

రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను నగరంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఆస్పత్రులు అనాథాశ్రమాల్లో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



శివనగర్‌లో కేక్ కట్ చేస్తున్న ఏసీపీ నందిరాం నాయక్, ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, నాయకులు

రాజకీయ పార్టీలు సహకరించాలి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సత్యశారద

కాశీబుగ్గ సెంటర్: వరంగల్ జిల్లాలో 2025కు సంబంధించిన ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ జాబితా రూపకల్పన, సవరణను కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించేలా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని రాజకీయ నాయకులను కోరారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 28 వరకు ప్రీ రివిజన్ నిర్వహించి అక్టోబర్ 29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. నవంబర్ 28 వరకు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి రెండు శనివారాలు, ఆదివారాలు ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు వివరించారు. 2024, డిసెంబర్ 24లోపు అభ్యంతరాలను ఓటర్ క్లెయిమ్స్‌ను పూర్తి స్థాయిలో పరిష్కరించి, 2025 జనవరి 6న తుది ఓటరు జాబితా రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18 వరకు బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వారీగా ఇంటింటికీ తిరుగుతూ ఓటరు ధ్రువీకరణ చేపడుతారని అన్నారు. 2025 జనవరి 1నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతిఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు ఈవీ.శ్రీనివాస్, బాకం హరిశంకర్, ఫైజ్ ఉల్లాహ్, శ్యామ్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాఖీ పండుగను పురస్కరించుకొని రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

వరంగల్ అర్బన్ : మౌలిక వసతులు కల్పించాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని పలు కాలనీల వాసులు సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన గ్రేటర్ గ్రీవెన్స్‌లో వినతులు అందజేశారు. మొత్తం 33 అర్జీలు రాగా.. అందులో ఇంజినీరింగ్ విభాగానికి 9, ప్రజారోగ్యం 4, పన్నుల విభాగం 2, టౌన్‌ప్లానింగ్ 18 నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కాపువాడలోని కాలనీవాసులు, న్మకొండ 58వ డివిజన్ పింగిలి కాలేజీ విజయ్‌పాల్ కాలనీకి 2018లో సీసీ రోడ్డు నిర్మించారని, కల్వర్టు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. అలాగే ఇంటింటా చెత్త సేకరించడం లేదని జి.ప్రకాశ్ ఫిర్యాదు చేశారు. ర్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్ఈ రాజయ్య, డిప్యూటీ కమిషనర్ రవీందర్, డీఎఫ్ఓ శంకర్‌లింగం, వెటర్నరీ వైద్యుడు గోపాల్‌రావు, టీఓ బిర్రు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి



వీసీలో బల్దియా కమిషనర్, అధికారులు

వరంగల్ అర్బన్ : ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఈ ఏడాది నవంబరులోగా పరిష్కారించాలని రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ గౌతమ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి బల్దియా టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బందికి ఎల్1, ఎల్2, ఎల్3 లాగిన్‌లు ఇవ్వాలని, సమన్వయంతో క్షేత్ర స్థాయిలో భూముల వివరాలను పారదర్శకంగా తనిఖీ చేయాలని చెప్పారు. నిబంధనల మేరకు లేకుంటే తిరస్కరించాలని సూచించారు. అలాగే వన మహోత్సవంతోపాటు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ల ఏర్పాటుపై ఆరా తీసిన దాన కిశోర్.. ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ల ఏర్పాటుపై మాట్లాడుతూ.. ఏబీసీ సెంటర్లు ఏర్పాటు చేసి వీధి కుక్కల సంతతిని నియంత్రించాలని చెప్పారు. వీసీలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇన్‌చార్జ్ సీపీ రవీంద్ర, సీఎంహెచ్ఓ రాజేష్, హెచ్ఓ రమేష్, టీపీఆర్ఓ కోల రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

‘యజ్ఞోపవీత ధారణ’



జంధ్యాల ధారణలో పద్మశాలీలు

వరంగల్: రాఖీ పౌర్ణమి పండగను పురస్కరించుకుని అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్‌లోని సాయిబాబా దేవాలయంలో పద్మశాలీలు సామూహిక యజ్ఞోపవీత జంధ్యాల ధారణ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో రాఖీ ధారణ, జంధ్యాల ధారణను వేద మంత్రాల మధ్య నిర్వహించారు. పదేళ్లుగా రాఖీ పండుగ సందర్భంగా రాఖీ, జంధ్యాల ధారణ వేడుకలను నిర్వహిస్తున్నట్లు రవీందర్ వివరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోరంటల రాజు, గుండేటి నరేంద్రకుమార్, శామంతుల శ్రీనివాస్, మార్గం ఎల్లయ్య, రాజగోపాల్, జి.సుధాకర్, బేతి అశోక్‌బాబు, డి.సత్యనారాయణ, బి.ఆనందం, ఝెలుగం సత్యనారాయణ, పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



హన్మకొండ: ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



కేయూ జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న సంఘం బాధ్యులు, సమ్మయ్యనగర్ వాసులు



కాజీపేట రూరల్: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

హన్మకొండ: సభ్యసమాజం తలదించుకునే విధంగా కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని కాళోజీ విగ్రహం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని కోరారు. ఇలాంటి పునరావృతం కాకుండా చూడాలన్నారు. బాధిత కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు సిరబోయిన కరుణాకర్, మద్దెల ఎల్లేష్, యేశబోయిన శ్రీనివాస్, వేల్పుల సారంగపాణి, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, కండె నర్సయ్య, సుదర్శన్, పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

కేయూ క్రాస్‌రోడ్డు వద్ద రాస్తారోకో

కేయూ క్యాంపస్: కోల్‌కతాలోని జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సమ్మయ్యనగర్ మాల దాసరి సంఘం బాధ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ జంక్షన్‌లో సోమవారం రాస్తారోకో చేశారు. మాల దాసరి సంఘం నాయకులు దానబోయిన రాంబాబు, తాటం గోపాల్, రావుల నరసింహ, రావుల వెంకన్న, కొవ్వాకుల రాములు, శేఖర్, తవుటం కుమార్, ఎల్లమ్మ, కంకణాల దుర్గమ్మ, రావుల కవిత పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

కాజీపేట రూరల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా కాజీపేట పట్టణంలో 62, 63, 64వ డివిజన్లలో పారిశుద్ధ్య కార్మికులు సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకుడు టి.ఉప్పలయ్య మాట్లాడుతూ వైద్య విద్యార్థినిని అత్యాచారం, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ సీఐటీయూ మండల అధ్యక్షుడు కోటేశ్వర్, మండల కార్యదర్శి ఎర్ర నరేష్, సునీల్, రవీందర్, అనిల్ పాల్గొన్నారు.

అత్యాచార ఘటనను ఖండించండి

నయీంనగర్: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అమానవీయ సంఘటన సభ్యసమాజం తలదించుకునేలా ఉందని, ఆ ఘటనను ప్రతిఒక్కరు తీవ్రంగా ఖండిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సమతా కమిటీ కన్వీనర్ వెలిదండి సుమలత తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని సూచించారు.

అటెన్షన్ ప్లీజ్



కంపుకొడుతున్న వ్యర్థాలు

వరంగల్ మహానగర పాలక సంస్థ 51వ డివిజన్ హనుమకొండ రాంనగర్‌లోని టీజీ ఎన్పీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ కార్యాలయం, ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ క్యాంపు కార్యాలయం సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దాంతో దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్తాచెదారాన్ని వీధుల్లో పడేస్తున్నారంటే ఇంటింటా చెత్త సేకరణ విఫలమైనట్లుగా కనిపిస్తోంది. – హన్మకొండ

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
అనిల్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, 51వ డివిజన్ ఇన్‌చార్జ్
ఫోన్‌నంబర్ : 91009 52764

ఎవరికి వారే..

ఖిలా వరంగల్: తూర్పు కోటలో కాంగ్రెస్ నాయకులు రెండుగా చీలారు. హనుమాన్ జంక్షన్‌లో రెండు వర్గాల నాయకులు పోటాపోటీగా మంత్రి సురేఖ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఒకే వేదికపై నిర్వహించేందుకు ఇరువురు అంగీకరించక పరస్పరం దూషించుకున్నట్లు తెలిసింది.